సచివాలయాల వ్యవస్థతో ప్రజల చెంతకు పాలన

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- బువ్వనపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం


పథకాల లబ్ధి వివరాలతో కూడిన కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: దేశంలో ప్రభుత్వ పాలన ప్రజల చెంతకు తెచ్చేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ చరిత్రాత్మక వ్యవస్థ అని, ఆ ఘనత ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బువ్వనపల్లి గ్రామ సచివాలయం-1 పరిధిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ సంకు శేషగిరిరావు ఇంటి నుంచి గాంధీ నగరం శివారు వరకూ నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని పలకరించి వారికి మూడేళ్లలో ప్రభుత్వం నుంచి అందిన పథకాల లబ్ధిని వివరించి, సంక్షేమ బావుటా కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సామాన్యుడు తన సమస్యను ఎవరికి చెప్పాలో తెలియక అనేక ఇబ్బందులు పడే వారన్నారు. నేడు గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ఆ సమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టిందన్నారు. ప్రతి కుటుంబ సమీపంలో వలంటీరు అందుబాటులో ఉన్నారని వారి ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చే అవకాశం కలిగిందన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని శాఖల సిబ్బంది గ్రామ సచివాలయాల వద్ద అందుబాటులో ఉంటారన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు..

పలువురు లబ్ధిదారులతో ప్రభుత్వ సంక్షేమ పాలనపై వాసుబాబు మాట్లాడారు. అధికారుల పనితీరు తెలుసుకుని సమస్యలు ఉంటే పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా స్వయంగా వచ్చినట్లు వారికి వివరించారు. అర్హత ఉంటే పార్టీలకు, కులాలకు అతీతంగా అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు, భీమడోలు మండలాల వైసీపీ బాధ్యులు పుప్పాల చినబాబు, కన్నబాబు, కార్తీక్ జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, జగనన్న గ్రామ సచివాలయాల మండల బాధ్యులు నౌడు వెంకట అచ్యుతరామారావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, వైస్ సర్పంచ్ వెల్లంకి నరేష్, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను తదితరులున్నారు.

నేడు పత్తేపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

పత్తేపురంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఏర్పాటు చేసినట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వాసుబాబుతోపాటు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు పత్తేపురం ప్రధాన చెరువు వద్ద నిర్మించే ఆర్వో వాటర్ ఫిల్టర్ శంకుస్థాపన, 9.30 గంటలకు రూ. 5 లక్షల వ్యయంతో కల్వర్టు శంకుస్థాపన, 10 గంటలకు గ్రామానికి చెందిన మిరాయాల వెంకట్రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిర్మించే ప్రయాణికుల విశ్రాంతి భవనం, 10.30 గంటలకు రూ.17 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న వైఎస్సార్ వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన, 10.45 గంటలకు రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, 11.00 గంటలకు రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన పత్తేపురం గ్రామ సచివాలయం నూతన భవనం ప్రారంభోత్సవం జరుగుతుందని సత్యకుమార్ తెలిపారు. అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడతారన్నారు.

నేడు పత్తేపురంలో 'గడపగడపకు'

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం పత్తేపురం సచివాలయం పరిధిలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమవుతుందని వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని గ్రామంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందిన ఆర్థిక లబ్ధిని వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు పాల్గోవాలని కోరారు.

క్లుప్తంగా

పుట్టినరోజే జనన ధ్రువీకరణ పత్రం మంజూరు


జననధ్రువీకరణ పత్రం అందజేస్తున్న వైద్యాధికారి

గణపవరం: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పురుడుపోసుకున్న వారికి బిడ్డ పుట్టిన రోజే జననధ్రువీకరణ పత్రం అందజేస్తామని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌నాయుడు అన్నారు. శుక్రవారం గణపవరం పీహెచ్‌సీలో పురుడుపోసుకుని, మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లికి ఆయన జనన ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఆస్పత్రిలో మూడు రోజులు బాలింతరాలికి భోజనం, పాలు, రొట్టె అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్ పీహెచ్ఎన్ జి.వరలక్ష్మి, స్టాఫ్ నర్సు ఓగిరాల పరిమళ పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం అందజేత


కోరుకల్లు సర్పంచ్ దాట్ల సుబ్బలక్ష్మి వికలాంగునికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

భీమడోలు: కోరుకల్లు మహిళా సర్పంచ్ దాట్ల సుబ్బలక్ష్మి వికలాంగునికి ఆర్థిక సాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కొల్లేరు ప్రాంతానికి చెందిన కోరుకల్లులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బలక్ష్మి పేదలు, వికలాంగులకు ఒకొక్కరికీ రూ.వెయ్యి చొప్పున రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. పేదలకు సాయం అందించిన సర్పంచ్‌ను పలువురు అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దలు దాట్ల సుబ్బరాజు, దాట్ల బుచ్చిరామరాజు, గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

గణపవరం: అన్ని వ్యాధులకు మూలమైన దోమల నివారణతో ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి గణపవరం మండలం చిలకంపాడులో దోమల వ్యాప్తి, నివారణ, దోమల నుంచి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఇంటింటికీ వెళ్లి అపరిశుభ్రత, దోమలవ్యాప్తి, వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యసహాయకులు నామాలరాజు, కాంతారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ఎంపీడీవోకు సత్కారం


ఎంపీడీవో మనోజ్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

పెదవేగి: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా ఉత్తమ ఎంపీడీవోగా 7వసారి అవార్డు అందుకున్న పెదవేగి ఎంపీడీవో జి. రాజ్‌మనోజ్‌ను ఘనంగా సత్కరించారు. పెదవేగి మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజ్‌మనోజ్‌ను ఎంపీపీ తాతారమ్యశ్రీ, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు అభ్యసనా సామగ్రి అందజేత

భీమడోలు: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పూళ్ల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని అందించారు. పాఠశాలలోని బాలబాలికలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పెదమల్లు సతీష్ ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పప్పుశెట్టి అన్నవరం, గ్రంధి గుప్త, మాజీ అధ్యక్షుడు పి.శేఖర్, సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ పేద రైతులకు వరం

దెందులూరు: వైఎస్సార్ జలకళ పథకం పేద రైతులకు వరమని గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అన్నారు. శుక్రవారం నాగులదేవునిపాడులో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో మంజూరైన వైఎస్సార్ జలకళ బోరును సర్పంచ్ శంకుస్థాపన చేశారు. రైతు మోర్ల నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రవేశ ఆర్చికి స్టీల్ అక్షరాల ఏర్పాటుకు దాత వేమూరి బాలకృష్ణ రూ.12 వేలు అందజేశారని హెచ్ఎం ఝాన్సీ తెలిపారు. పాఠశాల అభివృద్ధిపనులు చేపట్టినట్టు హెచ్ఎం తెలిపారు.

అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయి


భీమడోలులో ఉత్తమ గ్రామ కార్యదర్శి అవార్డు గ్రహీత ఎన్.ఠాగూర్‌ను, సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామకార్యదర్శిగా అవార్డును అందుకున్న భీమడోలు గ్రామ కార్యదర్శి నందేటి ఠాగూర్, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ దంపతులు, శానిటరీ మేస్త్రి సందీప్‌ను శుక్రవారం ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి ఎన్.ఠాగూర్, సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ సూచనల మేరకు గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తూ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పలువురు అభినందించారు. గ్రామాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న గ్రామకార్యదర్శి ఠాగూర్ అవార్డు దక్కడం చాలా సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, సచివాలయాల మండల కన్వీనర్ మద్దుల రాజా, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు,సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గృహసారథులకు కీలక బాధ్యతలు


పెరుగ్గూడెంలో సమావేశంలో మాట్లాడుతున్న దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: జగనన్న సచివాలయ కన్వీనర్లు, గ్రామ గృహసారథులపై కీలక బాధ్యతలు ఉన్నాయని, వారంతా పార్టీ అభివృద్ధికి పార్టీ ఆదేశాల మేరకు కృషి చేయాలని దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శుక్రవారం పెరుగ్గూడెంలో గ్రామ సచివాలయం యలమర్తి రేవతి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు విజయానికి మూలస్తంభాలుగా కృషి చేయాలన్నారు. సీతంపేట సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), జిల్లా కమిటీ సభ్యులు యలమర్తి సత్తిబాబు, ఎంపీటీసీ యలమర్తి బాపూజీ మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పరస్పర సహకారంతో నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ విజయానికి సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగనన్న సచివాలయ దెందులూరు మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, పార్టీ నాయకులు, గృహసారథులున్నారు.

కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


గణపవరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గణపవరం: ఢిల్లీలో ఉద్యమం సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని గణపవరం మండల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గణపవరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కృష్ణస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు గుత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నిరకాల పంటలకు గ్యారంటీ మద్దతు ధర, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు, 2022 విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, రైతులు, కౌలురైతుల అన్నిరకాల రుణాల రద్దు తదితర అంశాలపై ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. హామీల అమలుచేయకుంటే మళ్లీ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పి.నర్సింహమూర్తి, సీఐటీయూ నాయకులు ఎం.పెంటారావు, రైతుసంఘం, ప్రజాసంఘం నాయకులు పాల్గొన్నారు.

వరిపై తెగుళ్ల ఉధృతి


రావులపర్రులో పొలంబడిలో మాట్లాడుతున్న ఏవో వెంకటేష్

ఉంగుటూరు: వరిలో కాండం తొలుచుపురుగు, ఆకుముడత పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం రావులపర్రు ఆయకట్టులో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఏవో మాట్లాడుతూ ఆకుముడత నివారణకు కార్బొహైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ 2గ్రాములు ఒక లీటరు నీటిలో కలపాలని లేదా, కోయంత్రలిన్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు 20 నుంచి 25 రోజులు దశలో ఉన్న వరి పైరుపై క్లోరాంగ్రనిలిన్ ప్రోల్ 4జి గుళికలు 4 కిలోలు ఎకరాకు లేదా కార్బాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోల చొప్పున ఇసుకలో కలిపి చల్లాలని అన్నారు. గుళికలు వేసే సమయంలో ఉన్న నీరు భూమిలోనే ఇంకిపోయేలా చేయాలని వెంకటేష్ సూచించారు. ఈకార్యమంలో ఏఏవోలు, రైతులు పాల్గొన్నారు.

అచ్చమ్మ తల్లి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణం


అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో రూ.25 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపం


దాతలు గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆలయంలో గ్రామానికి చెందిన దాత మణికంఠ కన్‌స్ట్రక్షన్స్ అధినేత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు రూ.25 లక్షలతో కల్యాణ మండపం, పైపులైన్ నిర్మించారు. అన్ని వస తులు, పార్కింగ్ టైయిల్స్, చుట్టూ ప్రహరీ, ఏర్పాటు చేశారు. శుభకార్యాల నిర్వహణకు వీలుగా అమ్మవారి ఆశీస్సులతో కల్యాణ మండపం నిర్మించామని దాతలు వివరించారు.

హమాలీల చార్జీలు వెంటనే చెల్లించాలి

ఉంగుటూరు: హమాలీల చార్జీలు వెంటనే చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం బొమ్మిడి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించి ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం విక్రయించి రెండునెలలు గడుస్తున్నా సొసైటీల ద్వారా రావాల్సిన హమాలీల చార్జీలు రైతులకు అందజేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మిడి సొసైటీ పరిధిలో రూ.పది లక్షలు హమాలీల చార్జీలు చెల్లించాల్సి ఉందని అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ ధర్నా ఆందోళనలో కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని శ్రీనివాసరావు, దుడే కేశవ, లంకా వెంకటేశ్వరరావు, యర్రా వెంకటేశ్వరరావు, బుర్ల చింతాలు, వాన పల్లి హరికృష్ణ, దేడే రాంబాబు, ఆకుల వెంకన్న పాల్గొన్నారు.

జమున మరణం తీరనిలోటు

గణపవరం: సీనియర్ సినీనటి జమున మరణం చిత్రపరిశ్రమకు, రాజకీయ, కళారంగానికి తీరనిలోటని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాష్ట్ర సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిగా పనిచేస్తున్న కాలంలో జమున రంగస్థల, నాటక కళాకారుల పరిషత్ రాష్ట్ర చైర్మన్‌గా విశేష సేవలందించారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ఆమె జిల్లాలో ఆమె పలు పర్యాయాలు పర్యటించారని గుర్తు చేసుకున్నారు. ఆమె మరణం పట్ల తీవ్ర సంతాపం తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతోనే ఆరోగ్య ఉత్పత్తులు


భీమడోలులో పొలంబడిలో రైతులకు సూచలందిస్తున్న ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి

భీమడోలు: సేంద్రియ వ్యవసాయంతోనే ఆరోగ్య ఉత్పత్తుల సాగు సాధ్యమని భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి అన్నారు. భీమడోలులో శుక్రవారం దాళ్వా వరి సాగులో భాగంగా మండలస్థాయిలో నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమానికి ఏడీఏ పి.ఉషారాజకుమారి అధ్యక్షత వహించారు. పొలంబడిలో నిర్దేశించిన సూత్రాలను వివరించి రైతుల అనుమానాలను నివృత్తి చేసారు. వరి చేలల్లో కాండం తొలుచు పురుగు, ఆకుముడత తెగుళ్ల ఉధృతి అధికంగా ఉన్నట్లుగా గుర్తించారు. వాటి నిర్మూలనకు రైతులకు సూచనలందించారు. పర్యావరణ పరిసరాల విశ్లేషణలో భాగంగా రైతులతో కలిసి వ్యవసాయ శాఖాధికారుల బృందం క్షేత్ర పర్యటన చేసి శత్రు, మిత్ర పురుగుల ఉధృతిని గమనించారు. సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి కోడిగుడ్లు, నిమ్మరసంతో ద్రావణాన్ని తయారు చేసారు. దీని వల్ల వరిలో అధికంగా పిలకలు వస్తాయని రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ పి.ఉషారాజకుమారి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సేంద్రియ వ్యవసాయంతోనే సుసాధ్యమన్నారు. వరిలో మేలైన వ్యవసాయ పద్ధతులను ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పురుగు మందుల అధిక వినియోగంతో హాని


దెందులూరు ఏఓ కార్యాలయంలో మాట్లాడుతున్న అధికారులు, విద్యార్థులు

దెందులూరు: రైతులు ఎరువులు, పురుగు మందులను వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వాడాలని, వాటిని అధికంగా వినియోగం వల్ల పంటలకు, పర్యావరణానికి హాని కలుగుతుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కే.ఫణికుమార్ అన్నారు. శనివారం వ్యవసాయ కళాశాల (రాజమండ్రి) విద్యార్థులు వ్యవసాయ అవగాహన పని అనుభవ కార్యక్రమంలో (రావేప్) భాగంగా దెందు లూరు వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎరువులు, పురుగు మందుల డీలర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది రావేప్ విద్యార్థులకు ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులకు వ్యవసాయం, ఎరువులు, పురుగు మందుల వాడకం, ఇతర విషయాలపై ఏఓ గద్దె రమేష్ సుదీర్ఘంగా వివరించారు. వ్యవసాయ కళా శాల విద్యార్థినులు గిరిజా కుమారి, ప్రమీల, భావన, జ్యోతిక, శ్వేత, లక్ష్మీభాయి, మండల ఫెర్టి లైజర్స్, ఫెర్టిసైడ్స్ ఇన్‌పుట్ డీలర్ గాదంశెట్టి సుబ్బరామయ్య ఉన్నారు.

సత్వర న్యాయం అందించాలి


ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును సత్కరిస్తున్న జిల్లా జీపీ బి.జగన్నాథరెడ్డి

భీమడోలు: జిల్లా ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులైన బి.జగన్నాథరెడ్డి శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిసారు. నిడమర్రులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును నూతనంగా నియమితులైన జిల్లా గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ) బి.జగన్నాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించారు. వాసుబాబును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పేదలకు సత్వర న్యాయం అందించాలని వాసుబాబు కోరారు. స్పెషల్ పీపీ ఆల్తి శ్రీనివాస్, నాయకులు సుధాకర్, వైవీ రావు పాల్గొన్నారు.

మోనిటర్ అందజేత

ఉంగుటూరు : కొత్తగూడెంలో దివంగత సలగాల ప్రకాశరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రవికుమార్ రూ.5,600 విలువ గల మోనిటర్‌ను సర్పంచి ఏలేటి సునీత, సురేష్ చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు,పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు దాతను, సర్పంచిని అభినందించారు.

4న ఏలూరులో వికలాంగులకు పరికరాలు

గణపవరం: వికలాంగ విద్యార్థులకు వచ్చేనెల 4న కలెక్టరు ఆదేశాలమేరకు ఏలూరులో నిర్వహించే శిబిరంలో అవసరమైన పరికరాలను అందజేస్తారని వైద్యసిబ్బంది తెలిపారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడు హైస్కూల్లో వారు విద్యార్థులకు శిబిరం నిర్వహణ వివరాలు తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు 6నుంచి 18ఏళ్ల వయస్సు కలిగి ఉంటే వారికి కాలు, చేయి, వినికిడిలోప యంత్రం, మూడు చక్రాల సైకిల్, కృత్రిమ అవయవాలు, అందజేస్తారన్నారు. ఏలూరులో భవిత కేంద్రం అశోక్‌వర్ధన మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ పాఠశాలలో ఈశిబిరం ఏర్పాటు చేస్తారని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఈ శిబిరం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, హెచ్ఎంలు బి.కాంతిశ్రీ, టిఎస్‌వీ రంగనాయకులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని చదువుతోనే బంగారు భవిష్యత్తు

భీమడోలు: విద్యార్థుల్లో పరీక్షలంటే భయం, ఒత్తిడిని ఏలా అధిగమించాలో వివరిస్తూ శుక్రవారం పీఎం నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా పరీక్షపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలల్లో బాలబాలికలు టీవీ, డిజిటల్ స్కీన్, ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లలో పీఎం అందించిన ప్రత్యక్ష ప్రసంగాన్ని వీక్షించారు. భీమడోలు మండల బీజేపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్, ప్రధాన కార్యదర్శి సాదిమి సాయి దీపికలు భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కురెళ్లగూడెం, పోలసానిపల్లి, ఆగడాలలంక ఉన్నత పాఠశాలను సందర్శించారు. ప్రవీణ్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రసంగానికి మంచి స్పందన లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు


గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి


ఆలయ ఆవరణలో ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన వేదిక


ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్

గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలకు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమ్మవారి ఆలయం ఎదుట వేదిక, ఉత్సవాల్లో చిన్నారులను ఆకట్టుకునేందుకు జెయింట్‌వీల్, మ్యూజిక్ చైర్స్, విద్యుద్దీపాలతోతో దేవతామూర్తుల కటౌట్లు ఏర్పాటు చేశారు. రెండు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో హాజరయ్యే భక్తుల కోసం ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్, తాగునీరు, పోలీస్ పికెట్, వైద్యశిబిరం సౌకర్యాలు కల్పించారు. ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు కమిటీ పూర్తి చర్యలు తీసుకుంది.

- దెందులూరు